ప్రజాశక్తి
శనివారం 30 డిసెంబర్ 2023
5
అనంతపురం





అనంతపురంలో ఉరితాళ్లతో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు

మహిళలతో పెట్టుకుంటే భూస్థాపితమే

న్యాయమైన తమ డిమాండ్ల సాధనకోసం 18 రోజులుగా పోరాడు తున్నా ప్రభుత్వం కనీసం స్పందించలేదు. మహిళలతో పెట్టుకున్న ప్రభుత్వం భూస్థాపితం కావటం ఖాయమని అంగన్వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారానికి 18 రోజుకు చేరుకుంది. సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరవధిక సమ్మెలో భాగంగా రోజుకొక రీతిలో అంగన్వాడీలు తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలను పరిష్కరించాల్సి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ప్రభుత్వ తీరును నిరసిస్తూ వామపక్ష, ప్రతిపక్ష నాయకులు అంగన్వాడీలకు తమ మద్దతు తెలుపుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించేదాకా తమ సమ్మె ఆగదని వారు తెగేసి చెబుతున్నారు.

వార్త 6లో

సామాజిక సాధికారత

నినాదం కాదు... మా విధానం

బస్సు యాత్రలో ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా

'అనంత'లో సామాజిక సాధికార బస్సు యాత్ర



సామాజిక యాత్రలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పేర్నినాని

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సామాజిక సాధికారత మా నినాదం మాత్రమే కాదని... తమ విధానమని ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా పేర్కొన్నారు. అనంతపురం నగరంలో శుక్రవారం వైసిపి సామాజిక బస్సు యాత్రను చేపట్టింది. నగరంలోని అంబేద్కర్ సర్కిల్ నుంచి యాత్ర ప్రారంభించి ఓల్డ్‌టౌన్‌లోని తాడిపత్రి బస్టాండు వరకు సాగింది. ఈ యాత్రలో ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ , మాజీ మంత్రి పేర్ని నాని, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర రావు పాల్గొన్నారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అందకుండా టిడిపి జనసేనలు కుట్ర పన్నుతున్నాయని విమర్శించారు. చంద్రబాబు మాయ మాటలను ఎట్టి పరిస్థితుల్లో నమ్మొద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎస్సీ,ఎస్టీ బిసి మైనార్టీలకు అత్యధిక పదవులిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. సామాజిక సాధికారత అన్నది నినాదం మాత్రమే కాదని, వైసిపి విధానమని చాటి చెప్పారని తెలిపారు. మాజీ మంత్రి పేర్ని నాని మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ , బిసి మైనార్టీలను మోసం చేసిన దుర్మార్గుడు చంద్రబాబునాయుడు అని విమర్శించారు. చంద్రబాబు నాయుడు బిసి,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలను ఓటు బ్యాకుంగానే చూసారని అన్నారు. రాజ్యాధికారంలో వారికి చోటులేదని పేర్కొన్నారు. ఓడిపోయిన నారా లోకేశ్‌కు మంత్రి పదవి ఇచ్చారని గుర్తు చేశారు. అదే వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాలనలో 17 మంది బిసి,ఎస్సి,ఎస్టీ మైనార్టీలకు మంత్రివర్గంలో చోటు కల్పించారనిచెప్పారు. మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్ మాట్లాడుతూ టిడిపి, జనసేన మైండ్ గేమ్ అడుతున్నాయని విమర్శించారు. తప్పుడు సమాచారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వమంటే బినామీ సంస్థగా చంద్రబాబు భావించారని ఆరోపించారు. నమ్మకూడని వ్యక్తి చంద్రబాబు అయితే నిలకడలేని వ్యక్తి పవన్ కళ్యాణ్ అని ఎద్దేవా చేశారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉష చరణ్ శ్రీ మాట్లాడుతూ అంబేద్కర్, పూలే ఆశయాల బాటలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పయణిస్తున్నారని కొనియాడారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసారని పేర్కొన్నారు. అనంతపురం ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ విద్య ద్వారా సామాజిక అభివృద్ధి సాధ్యమని భావించి నాడు, నేడు పనుల ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలను ముఖ్యమంత్రి మార్చారని పేర్కొన్నారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ సంక్షేమం అంటే ఏదో ఉచితంగా ఇచ్చేది కాదని, లబ్దిదారుల జీవితాలు మారాలని ఆకాంక్షించిన వ్యక్తి ముఖ్యమంత్రి అని కొనియాడారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించలేని వారు ప్రజలకేం చేస్తారు..?

సమ్మె శిబిరం ముందు వెళ్లిన సామాజిక యాత్ర

కార్మికులను పలకరించని నాయకులు

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్



మున్సిపల్ కార్మికుల సమ్మె శిబిరం ముందు వెళుతున్న బస్సుయాత్ర

రోడ్డుమీద కూర్చొని తమ సమస్యలు పరిష్కారం చేయాలని నిరవధిక సమ్మె చేస్తున్న కార్మికులనే గుర్తించలేని నాయకులు ఇక ప్రజలకు ఏమాత్రం న్యాయం చేస్తారని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎటిఎం నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర శుక్రవారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం మీదుగా వెళ్ళింది. కార్పొరేషన్ కార్యాలయం ముందర నిరవధిక సమ్మె చేస్తున్న పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల శిబిరం వైపు మంత్రులు, ఎమ్మెల్యేలు కన్నెత్తి కూడా చూడలేదు. దీంతో కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల గోడు పట్టించుకోని ప్రభుత్వం ప్రజలకు ఏం చేస్తుందని వారు ప్రశ్నించారు ఈ సందర్భంగా కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు తమకు ఇచ్చిన అమలు చేయాలని నాలుగు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్టుగా లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక న్యాయం బస్సు యాత్ర అనంతపురం నగరపాలక సంస్థ ముందర నుండి వెళుతున్న సమయంలో కార్మికులు నిరవధిక సమ్మెలో కూర్చున్న శిబిరం వైపు కూడా నాయకులు చూడకపోవటం దుర్మార్గమన్నారు. మున్సిపల్ మహిళా కార్మికులు 20 మంది ఉరి తాళ్ళను బిగించుకొని నడిరోడ్డుపై నిలబడి ఉన్నా కూడా కార్మికుల సమ్మె శిబిరం వైపు చూడకుండా కార్మికులను కనీసం పలకరించకుండా కార్మికుల ఆవేదనను గుర్తించకుండా వెళ్లడం అమానవీయమన్నారు. కనీసం రోడ్డుపైన ఉన్న కార్మికులను పలకరించకపోతే ప్రజలకు ఇంక ఏమాత్రం సేవలు అందించడానికి ఈ యాత్ర చేస్తున్నట్లు అని ఎద్దేవా చేశారు. ఈ యాత్ర కేవలం రాజకీయ లబ్ధి కోసం చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి ప్రభుత్వాన్ని బుద్ధి చెప్పి ఇంటికి పంపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక మిత్ర సంఘాల నాయకులు, కమిటీ సభ్యులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జాతీయ ర్యాంకింగ్ మెరుగుకు కృషి చేయాలి

విశ్వేశ్వర టెక్నాలజీ వర్సిటీ పూర్వ విసి బాలవీరారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

జాతీయ ర్యాంకింగ్‌లో అనంతపురం జెఎన్‌టియు అగ్రభాగాన ఉండేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విశ్వేశ్వర టెక్నాలజీ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి కె.బాలవీరారెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ సెమినార్ హాలులో విసి రంగజనార్ధన అధ్యక్షతన జాతీయ ర్యాకింగ్స్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాల వీరారెడ్డి ర్యాకింగ్స్ ఎలా పొందాలి, ర్యాంకింగ్స్‌ను ఎలా అభివృద్ధి చేసుకోవాలో వివరించారు. ముఖ్యంగా యూనివర్సిటీలు వారి వనరులను పంచుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బాల వీరారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యకమంలో రిజిస్ట్రార్ శశిధర్, ఐక్యూఎసి డైరెక్టర్ సుబ్బారెడ్డి, యూనివర్సిటీ డైరెక్టర్లు బి.ఈశ్వర్‌రెడ్డి, ఎ.సురేష్‌బాబు, వి.బి.చిత్ర, ఎన్.విశాలి, ఆర్.కిరణ్మయి, పద్మసువర్ణ, సి.శోభాబిందు, పి.సుజాత, బి.దుర్గాప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, తదితరులు పాల్గొన్నారు.



మాజీ విసి బాలవీరారెడ్డిని సన్మానిస్తున్న జెఎన్‌టియు విసి, రిజిస్ట్రార్, తదితరులు

బెదిరించి పనులు చేయిస్తారా..?

బస్సుయాత్ర కోసం రోడ్లు శుభ్రం చేయాలా..

సమస్యలు మాత్రం పరిష్కరించరా..

మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఏటీఎం నాగరాజు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్



పోలీసు అధికారితో మాట్లాడుతున్న నాయకులు

సామాజిక సాధికార బస్సుయాత్రను పురస్కరించుకుని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు అధికారులు మహిళా కార్మికులను బెదిరించి రోడ్లను శుభ్రం చేయించేందుకు ప్రయత్నించడం బాధాకరమని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు అన్నారు. ఈమేరకు మంగళవారం నగరంలోని పాతూరులో పని చేస్తున్న కార్మికుల వద్దకు వెళ్లి పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులను బెదిరించి పనులు చేయించుకోవాలని చూస్తే సహించబోమని హెచ్చరించారు. రోడ్లు శుభ్రం చేయాలన్న అధికారులు 3 లక్షల మంది ప్రజల కోసమా.. సామాజిక సాధికార బస్సుయాత్ర కోసమా.. చెప్పి పనులు చేయించాలన్నారు. ప్రజల మద్దతుతోనే కార్మికులు సమ్మె చేపట్టారన్నారు. నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్నా కార్మికులను కనీసం పలకరించని ఎమ్మెల్యే, అధికారులు, ఇప్పుడు బలవంతంగా పనులు ఎలా చేయిస్తారని నిలదీశారు. తమపై పెత్తనం చేస్తున్న సచివాలయం సిబ్బందితో పని చేయించాలని సూచించారు. గతంలో కూడా కార్మికులు సమ్మె చేస్తుండగా అప్పట్లో కమిషనర్, మేయర్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు స్వయానా పరకలు పట్టి రోడ్డు ఊడ్చారని, ఇప్పుడు ఎందుకు చేయడం లేదని గుర్తు చేశారు. నిరక్షరాస్యులు, దళితులు అన్న చులకన భావంతో కార్మికులపై కర్రపెత్తనం సాగిస్తామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ దశలో పోలీసులు జోక్యం చేసుకుని సర్ది చెప్పి పంపారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నగర కార్యదర్శి తిరుమలేశు, వరలక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.

వైసిపిలో కొనసాగుతున్న అలజడి..!

సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చుతారన్న ఊహాగానాలు

పలుచోట్ల నిరసనలు, రాజీనామాలు

తమ నాయకులకు ఇవ్వకుంటే పార్టీకి పనిచేయమని బెదిరింపు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



వైసిపిలో అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తల నియమకాలపై స్పష్టత వస్తుండటంతో పార్టీలో అలజడి మొదలైంది. ఒకటి,రెండు రోజుల్లో నియోజకవర్గ సమన్వకర్తల నియమాకాలు చేపట్టే ప్రక్రియ పూర్తయ్యే అవకాశాలుండటంతో ఆశావహుల్లో గుబులు రేగుతోంది. స్థానాన్ని పదిలం చేసుకునేందుకు శాయశక్తులా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. మరోవైపు టిక్కెట్టుపై ఆశలు సన్నగిల్లిన వారు ఆందోళనబాట పట్టేందుకు సమాయత్తమవుతున్నారు. కదిరి, పెనుకొండల్లో రెండు రోజులుగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. కదిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే సిద్దారెడ్డి మద్దతుదారులు రెండు రోజులుగా నిరసనలు కొనసాగిస్తున్నారు. శుక్రవారం రోజు కొంత మంది తమ పదవులకు రాజీనామాలు చేశారు. గాండ్లపెంటలో కొంత మంది రాజీనామాలు చేసిన వారిలోనున్నారు. సిద్ధారెడ్డికే వచ్చే ఎన్నికల్లోనూ టిక్కెట్టు ఖరారు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గ సమన్వయకర్తగా మక్బుల్‌ను నియమిస్తారన్న ప్రచారం సాగుతోంది. అధికారికంగా ఇంకా ప్రకటన రాలేదు. ఇంతలోనే నిరసనలు కొనసాగుతున్నాయి. ఇక పెనుకొండకు సంబంధించి కూడా మంత్రి ఉషచరణ్ శ్రీ తనకు పెనుకొండ టిక్కెట్టు ఖరారైందని చెప్పడంతో అక్కడా సమస్య ఉత్పన్నమైంది. శంకరనారయణకు మద్దతుగా కొంత మంది గళం వినిపిస్తున్నారు. హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్తను ఇది వరకే మార్చారు. ఎమ్మెల్సీ ఇక్బాల్‌ను మార్చి దీపికను నియమించారు. ఆ సమయంలోనూ వివాదం చెలరేగింది. ఇప్పటికీ నేతల మధ్య సమన్వయం కుదరలేదు. వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో దీపిక నియామకంపైనా ఒకనాకొన దశలో పునరాలోచన జరిగినట్టు చర్చ నడిచింది. రాయదుర్గం టిక్కెట్టును ఖరారు చేయించుకునేందుకు కాపు రామచంద్రారెడ్డి అమరావతిలోనే మకాం వేసి ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇదే బాటలో మరికొంత మంది తమ స్థానాలను పదిలం చేసుకునే పనిలో పడ్డారు. నాలుగైదు స్థానాల్లో మినహా అన్ని చోట్ల మార్పులుండే అవకాశముందని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఒకటి,రెండు రోజుల్లో సమన్వయకర్తల ప్రకటన వెలువడనున్నట్టు సమాచారం. ప్రకటన వెలువడిన తరువాత పరిస్థితి ఏ రకంగా ఉంటుందన్న చర్చ నడుస్తోంది. మరికొన్ని చోట్ల వివాదాలు చెలరేగే అవకాశాలున్నట్టు స్పష్టమవుతోంది. ఇప్పటికే ఒక నాయకుడు తనకు టిక్కెట్టు లేదనిముందే చెబితే మరో పార్టీలో చేరి తెచ్చుకుంటానని ముఖ్య నేతల ముందు అల్టిమేటం జారీ చేసారన్న ప్రచారం నడుస్తోంది. వైసిపి సమన్వయకర్తల నియామకంపైనే రాజకీయాల్లో హాట్‌టాపిక్ నడుస్తోంది. ఎవరికి అవకాశమొస్తుంది..ఎవరికి రాదన్నదే సర్వత్రా నడుస్తున్న చర్చ. రాని వారి పరిస్థితి ఏ రకంగా ఉంటుంది..వారు ఏమి చేయనున్నారన్నది ఆసక్తికరంగా మారింది. మొన్నటి వరకు నియోజకవర్గంలో అంతా తామేనని అనుకుంటూ వచ్చిన నేతలకు ఇప్పుడు ఒక్కసారిగా టిక్కెట్టు లేదని తెలిసే సరికి అయోమయంలో పడుతున్నారు. టిక్కెట్టు రాకపోయినా పార్టీలోనే కొనసాగాలా... లేక ఇతర పార్టీల్లోకెళ్లి కొత్త ప్రయత్నాలు చేసుకోవాలా అన్న మీమాంసలోనూ పడ్డారు. అయితే వచ్చే సమస్యలను అధిష్టానం ఏ రకంగా పరిష్కరించగలదన్నది చూడాల్సుంది.

హక్కుల కోసం పోరాడుతుంటే బెదిరించడం అన్యాయం

షోకాజ్ నోటీసులు రద్దు చేసుకోండి

ఎస్ఎస్ఎ ఎపిసి వరప్రసాద్‌కు ఉద్యోగుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

'రాజ్యాంగ్ కల్పించిన హక్కులను అమలు చేయాలని ప్రభుత్వంతో పోరాడుతున్నాం.. అధికారులుగా సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి మా సమస్యలు తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సింది పోయి షోకాజ్ నోటీసులు ఇచ్చి సమ్మె విరమించాలని చూడటం సరికాదు... తక్షణమే సోకాజ్ నోటీసులు రద్దు చేయాలి' అంటూ ఎస్ఎస్ఏ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కోరారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేపట్టిన సమ్మె శుక్రవారం 10వ రోజుకు చేరుకున్నాయి. సమ్మె సందర్భంగా ఎస్ఎస్ఏ ఉద్యోగులు సోకాజ్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె శిబిరం నుంచి ర్యాలీగా ఎస్ఎస్ఏ ఏపిసి కార్యాలయం వరకూ ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. మండుటెండలోనే మహిళా ఉద్యోగినిలు నడుచుకుంటూ వెళ్లి నిరసన తెలిపారు. అనంతరం ఎస్ఎస్ఏ ఏపిసి వరప్రసాద్ ఛాంబర్ వద్ద నిలబడి ఆందోళన నిర్వహించారు. వెంటనే షోకాజ్ నోటీసులు ఉపసంహరించుకోవాలని కోరారు. ఇందుకు స్పందించిన ఏపిసి రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలను తాము పాటించాల్సి ఉందన్నారు. తమతోపాటు ఉద్యోగులు కూడా విధిగా నడుచుకోవాలన్నారు. హక్కుల కోసం ఉద్యోగులు సమ్మె చేయడాన్ని తాము వ్యతిరేకించడం లేదన్నారు. బోధన ఉద్యోగులు సమ్మెలోకి వెళ్లడం సరికాదన్నారు. ఇందుకు ఉద్యోగులు స్పందిస్తూ తాము ఆందోళన చేస్తే వెంటనే షోకాజు నోటీసులు ఇస్తున్న అధికారులు తమకు నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురైనప్పుడు ఎందుకు స్పందించలేదంటూ నిలదీశారు. అప్పుడు పిల్లలు గుర్తుకు రాలేదా.. అని ప్రశ్నించారు. సోకాజ్ నోటీసులు ఇచ్చేందుకు వచ్చిన చేతులు, కలం మా సమస్యలు పరిష్కారానికి ఎందుకు రావడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జెఎసి ఛైర్మన్ విజయ్ మాట్లాడుతూ సిఎం జగన్ ఇచ్చిన హామీలనే తాము అమలు చేయాలని కోరుతున్నామన్నారు. అధికారులతో మాకు ఎలాంటి వైరం లేదు. అధికారులు కూడా ఉద్యోగుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలన్నారు. మానవీయ కోణంలో ఉద్యోగుల సమ్మెకు అధికారులు మద్దతు పలకాలని కోరారు. స్పందించిన ఏపిసి సమస్యల పరిష్కారానికి తమ వంతుకృషి చేస్తామన్నారు. వీరి సమ్మెకు ఏపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు హాజరై మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల జెఎసి నాయకులు అర్లప్పరెడ్డి, నవీన్, సువర్ణ, అంబరీష్, చిరంజీవి, శ్రీదేవి, రాజేశ్వరి, లీలావతి, హంపమ్మ, వాణి, మనోహర్, కోదండరామ్, పెద్ద వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు మృతి

◆ మరో ఇద్దరి పరిస్థితి విషమం ◆ ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న లారీ


◆ ట్యూషన్‌కు వెళుతూ ప్రమాదానికి గురైన పదో తరగతి విద్యార్థులు



కుమారుడి మృతదేహం వద్ద విలపిస్తున్న తండ్రి

ప్రజాశక్తి నార్పల

నార్పల మండల పరిధిలోని కేశేపల్లి బ్రిడ్జి వద్ద సిమెంటు లారీ ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలు... నార్పలకు చెందిన కుమ్మర నారాయణ స్వామి కుమారుడు గౌతమ్, రాజకుల్లాయప్ప కుమారుడు రాజుకుల్లాయప్ప, నార్పలలోని సుల్తాన్ పేటకు చెందిన రామచంద్రారెడ్డి కుమారుడు అభిషేక్ రెడ్డి, బొందలవాడ గ్రామానికి చెందిన బ్రహ్మయ్య కుమారుడు విష్ణు నార్పల ప్రభుత్వ బాలుర పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. వీరు నలుగురు మంచి స్నేహితులు. వీరు పాఠశాల సమయం ముగియగానే సమీపంలోని కేశేపల్లిలో ట్యూషన్‌కు వెళుతుండేవారు. రోజు మాదిరిగానే శుక్రవారం పాఠశాల సమయం ముగియగానే ఒకే ద్విచక్రవాహనంలో ట్యూషన్ కోసం కేశేపల్లికి బయలు దేరారు. అదే సమయంలో సిమెంట్‌లోడుతో తాడిపత్రి వైపు నుంచి వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న వీరి ద్విచక్రవాహనాన్ని కేశేపల్లి బ్రిడ్జి వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో గౌతమ్ (15), విష్ణు(15) అక్కడికక్కడే మృతిచెందారు. రాజుకుల్లాయప్ప, అభిషేక్ రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు గాయపడిన వారిని 108 ద్వారా అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే మృతుల, క్షతగాత్రుల తల్లిదండ్రులు, గ్రామస్తులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతుల బంధువులు చేస్తున్న రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి. భవిష్యత్తుపై ఉన్నత ఆశలతో ప్రతిరోజు పాఠశాల అయిపోగానే ట్యూషన్ కి వెళ్లి చదువుకొంటున్న విద్యార్థులు జీవితాలు అర్ధాంతరంగా ముగియడంతో వారి కుటుంబసభ్యులు ఆశలను లారీ రూపంలో ఆవిరయ్యాయి. మృతిచెందిన విద్యార్థి గౌతం తండ్రి నారాయణస్వామి నార్పలలో డ్రైవర్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు నారాయణస్వామికి గౌతమ్ ఏకైక కుమారుడు కావడంతో ఆ తల్లిదండ్రుల రోదన వర్ణాతీతంగా మారింది. సంఘటనా స్థలాన్ని ఎస్సై రాజశేఖర్ రెడ్డి సందర్శించి మతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం తరలించారు



విద్యార్థులు గౌతమ్, విష్ణు (ఫైల్‌ఫొటోలు)

మహిళలతో పెట్టుకుంటే భూస్థాపితమే

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

'18 రోజులుగా పోరాడుతున్నాం.. ప్రభుత్వం కనీసం స్పందించలేదు.. తమ సమస్యలు పరిష్కరించకుంటే ఉరితాళ్లే గతి,,' అంటూ అంగన్‌వాడీలు ఆందోళన చెందారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం జిల్లావ్యాప్తంగా వివిధ రూపాల్లో వినూత్న పద్ధతుల్లో నిరసనలు కొనసాగాయి. ఇందులో భాగంగా కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై మెడలో ఉరితాళ్లు వేసుకుని కొందరూ మౌన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం స్పందించాలని, లేకుంటే ఆత్మహత్యలే గతి అంటూ కొందరు నినదిస్తే, చెడు వినకు, చెడు మాట్లాడకు అంటూ మెడలో పూల మాలలు వేసి కళ్లు, చెవులు మూసుకుంటూ నిరసన తెలిపారు. ప్రభుత్వ తీరు ఉంటే మా ఉరితాళ్లే రాబోవు ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి ఉరితాళ్లుగా మారి బిగిస్తాయని హెచ్చరించారు. వీరి సమ్మెకు సిఐటియు జిల్లా కోశాధికారి టి.గోపాల్, నగర కార్యదర్శి వెంకటనారాయణ, రామాంజినేయులు, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ముస్కిన్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు జయ భారతి, జమున, అరుణమ్మ, పద్మ, శ్రీదేవి, సూర్యకళ, హరిప్రియ, ఆరీఫా, సాహీనా, రుక్మిణి, పార్వతి పాల్గొన్నారు.

కొనసాగిన అంగన్‌వాడీల నిరసన



ఎమ్మెల్యే కేశవ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న అంగన్వాడీలు



రాయదుర్గంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు నాగేంద్ర



ఉరవకొండ, విడపనకల్, వజ్రకరూరు మండల కేంద్రాలలో 18వ రోజు శుక్రవారం కూడా అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. ఇందులో భాగంగా ఉరవకొండలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మెకు ఎమ్మెల్యే, పిఎసి ఛైర్మన్ పయ్యావుల కేశవ్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలతో పెట్టుకున్న ప్రభుత్వాలు భూస్థాపితం కావడం తధ్యమన్నారు. అంగన్వాడీలు చేపట్టిన ఉద్యమంతో రాష్ట్ర ప్రభుత్వానికి ముచ్చెమటలు పట్టాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగొచ్చి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రామప్పచౌదరి, పవన్‌కుమార్, కెటి రంగప్రసాద్, ఉరవకొండ వజ్రకరూరు మండలాల కన్వీనర్లు మధుసూదన్, విరుపాక్షి, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, జ్ఞానమూర్తి, అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు విజయ, అరుణకాంతమ్మ, దుర్గాదేవి, శ్వేత, సరోజమ్మ, వరలక్ష్మి, భాగ్య, లోకమ్మ, మునెమ్మ, మంజుల, కృష్ణవేణి, సువర్ణమ్మ, సుశీలమ్మ, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం అంగన్వాడీల సమ్మె కొనసాగింది. వీరి సమ్మెకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ మద్దతు తెలిపి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

పామిడిలో అంగన్వాడీల ఆక్రందన 18వ కూడా రోజు కొనసాగింది. ఇందులో భాగంగా శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సమ్మె దీక్షను కొనసాగించారు. వీరనికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కసాపురం రమేష్, నియోజకవర్గ కార్యదర్శి గంగ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు అనిమిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, అంగన్వాడీలు మహాలక్ష్మి, రామాంజనమ్మ, రమాదేవి, సేకున్‌బి, ప్రేమకుమారి, తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో చేపట్టిన సమ్మె 18వ రోజుకు చేరుకుంది. వీరికి రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కసాపురం రమేష్, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మల్లేష్, వి.నిర్మల, సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణ, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున సమ్మెకు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు నాయకురాలు గంగ, సెక్టార్ నాయకురాళ్లు పార్వతి, శారద, అరుణ, రాణి, రోజ్ మేరీ, గంగ, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట మండల పరిధిలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మెకు జెడ్పీ మాజీ ఛైర్మన్ పూల నాగరాజు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తిప్పేస్వామి, నాగరాజు, అంగన్వాడి ప్రాజెక్టు కార్యదర్శి మేరీ, సెక్టార్ నాయకులు రాధిక, మెహ్రూన్, రుద్రమ్మ, చంద్రకళ, మల్లమ్మ, అంగన్వాడీలు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు

ఆత్మకూరు మండల కేంద్రంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి అంగన్వాడీలు వినతిపత్రం సమర్పించారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ మీ సమస్యలను ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

పుట్లూరులో అంగన్వాడీల సమ్మె కొనసాగింది. వీరి సమ్మెకు సిపిఎం మండల కార్యదర్శి సూరి, అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు జయలలిత, తాడిపత్రి రూరల్ కార్యదర్శి హనుమంతురెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు, నాయకులు శశికళ, అనంతలక్ష్మి, రమాదేవి, జి.వెంకటచౌదరి, టి.పెద్దయ్య, బి.భాస్కర్‌రెడ్డి, కె.నాగభూషణ్, అంగన్వాడీలు పాల్గొన్నారు.

నార్పలలో అంగన్వాడీల సమ్మె 18వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు డొక్కా శ్రీదేవి, నార్పల సెక్టార్ నాయకురాళు ఎం.రామంజినమ్మ, సుధామణి, రేణుక, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మెకు యుటిఎఫ్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రభుత్వ స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రఘునాథ, శ్రీరాములు, రామ్మోహన్, కళ్యాణదుర్గం ప్రాజెక్టు అధ్యక్షురాలు తిప్పిరమ్మ, అంగన్వాడీలు సుజాత, అనిత, సంతోషమ్మ, త్రివేణి, ఎర్రమ్మ, వరలక్ష్మి, సుజాత, సత్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరులో అంగన్వాడీలు పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టారు. ఇందులో భాగంగా సమ్మె శిబిరం నుంచి ర్యాలీగా పోస్టాఫీస్‌కు చేరుకుని కార్డులను పోస్టుబాక్సులో వేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి దస్తగిరి, యూనియన్ నాయకురాళ్లు నాగరాణి, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో అంగన్వాడీలు నల్లచీరలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా దిగొచ్చి సమస్యలను పరిష్కరించకపోఏ ఆందోళలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన ఉధృతం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా 4వరోజు శుక్రవారం ప్రధాన రహదారిపై ఉరితాళ్లు వేసుకుని నిరసన వ్యక్తం చేశారు. వీరికి సిఐటియు నాయకులు, మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు సంఘీభావం తెలిపారు. సమ్మెను మున్సిపల్ కార్మికుల జిల్లా అధ్యక్షులు ఏటీఎం నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించమని కార్మికులు అడిగితే ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించటం దారుణమన్నారు. కార్మికులు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇది చాలదన్నట్లు మరోమారు కరోనా మహమ్మారి కొత్తరూపం దాలుస్తున్న నేపథ్యంలో ప్రజలు భయభ్రాంతులకు గురవుతన్నారన్నారు. నాలుగు రోజులుగా కార్మికులు కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదన్నారు. ప్రభుత్వ పెద్దలు బాగుంటే చాలు రాష్ట్ర ప్రజలు ఏమైపోయినా తమకు పర్వాలేదు అన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించేంత వరకూ సమ్మెలు విరమించేది లేదన్నారు. అనంతరం మున్సిపల్ కార్మికులందరూ ఉరితాళ్లతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. వీరికి సిఐటియు జిల్లా ట్రెజరర్ గోపాల్, టిఎన్‌టియుసి అధ్యక్షులు పోతుల లక్ష్మీనరసింహులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో 1వ పట్టణ కమిటీ కార్యదర్శి వెంకట్‌నారాయణ, ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు నల్లప్ప, నగర అధ్యక్ష కార్యదర్శులు, బండారి స్వామి సాకే తిరుమలేష్, ఇంజనీరింగ్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు ఓబుళపతి, మల్లికార్జున, సంజీవరాయుడు, మురళి, పోతులయ్య, మహిళా కన్వీనర్ లక్ష్మీనరసమ్మ, మంత్రి వరలక్ష్మి, శశీంద్రకుమార్, ఆది, రాఘవేంద్రప్రసాద్, ముత్తురాజు, లక్ష్మీదేవి, కాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : మున్సిపల్ కార్మికులకు సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకూ సమ్మె ఆపే ప్రసక్తే లేదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ స్పష్టం చేశారు. మున్సిపల్ కార్మికుల చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 4వరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ సాక్షాత్తు అసెంబ్లీ సాక్షిగా మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయమని అడుగుతుంటే పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఎన్నోఏళ్ల నుంచి ప్రజల మలినాలను శుభ్రం చేస్తూ, మురికి కాలువలు, పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్న మున్సిపల్ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని తెలిపారు. ఇప్పటికైనా సిఎం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాగా సమ్మె చేస్తున్న కార్మికుల శిబిరం వద్దకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళశిల్ప, వార్డు సభ్యులు వచ్చి సమ్మె విరమించాలని కోరారు. ఇందుకు సిఐటియు నాయకులతోపాటు కార్మికులు ససేమిరా అన్నారు. మీరు తక్షణం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసి తమ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని, లేనిపక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వీరికి రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాయదుర్గం డివిజన్ కార్యదర్శి ఎస్‌వి ఆంజనేయులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు తిప్పేస్వామి, మల్లేష్, రాము, వెంకటేశులు తిప్పేరుద్ర, నరసింహులు, మైలారప్ప మరియు పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

గుత్తి : మున్సిపల్ కార్మికులకు శ్రమకు తగ్గట్టుగా ప్రభుత్వం వేతనం ఇవ్వాలని రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కసాపురం రమేష్ డిమాండ్ చేశారు.



తాడిపత్రిలో

ఉరితాళ్లతో పారిశుధ్య కార్మికుల నిరసన



గుత్తిలో ఉరితాళ్లు బిగించుకుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

సమస్యల పరిష్కారం కోసం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె గుత్తిలో శుక్రవారం నాలుగో రోజుకు చేరుకుంది. సమ్మెకు సిపిఎం ప్రజాసంఘాల నాయకులు మద్దతు పలికారు. నాయకులు, కార్మికులు ఉరితాళ్లతో వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణ, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మల్లేష్, వి.నిర్మల, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, పారిశుధ్య కాంట్రాక్ట్ కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.రామాంజనేయులు, కె.సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు కె.మహేష్, సహాయ కార్యదర్శి సుంకన్న, కోశాధికారి బాల రంగన్న, నాయకులు ఈశ్వరయ్య, పెద్దక్క, ఇంజనీరింగ్ విభాగ కార్మికుల సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.రాజా, కార్యదర్శి రవిశంకర్, నాయకులు మురళి, నరసింహ, శేఖర్, షరీఫ్, సాధిక్, బాబా తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : సమస్యలు పరిష్కరించకపోతే ఆత్మహత్యలే శరణ్యమని మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ కాంట్రాక్టు కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. తాడిపత్రి మున్సిపాలిటీలో కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవానికి 4వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా మెడకు ఉరితాళ్లు తగిలించుకుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కమిటీ అధ్యక్షుడు రామాంజనేయులు, ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు,ఉపాధ్యక్షులు జుబేర్, ఓబయ్య, జి పి ప్రసాద్, మహబూబ్ బాషా, వన్నూరప్ప, రాముడు, శంకర్, మహిళా కార్మికులు ధనలక్ష్మి, నాగలక్ష్మి, లక్ష్మీదేవి, పుల్లమ్మ, కాకార్మికులు పాల్గొన్నారు.

గుంతకల్లు : సిఎం జగన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం నాల్గవ రోజుకు చేరింది. ఇందులో భాగంగా ఏపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు కె.సరసయ్య, నాయకులు సూరి నాయకత్వంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మెడలకు ఉరితాళ్లు వేసుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో సమావేశం ముగించుకుని బయటికి వస్తున్న ఛైర్‌పర్సన్ భవాని, వైస్‌ఛైర్‌పర్సన్లు మైమున్, నైరుతీరెడ్డి, కమిషనర్ మల్లికార్జున, కౌన్సిలర్లను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. వీరికి జనసేన, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వాసగిరి మణికంఠ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి బి సురేష్, నాయకులు చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'షూ సిటీ' వార్షికోత్సవం

స్కూల్స్ షూస్‌పై ప్రత్యేక తగ్గింపు : అధినేత మధు

ప్రజాశక్తి-అనంతపురం



నగరంలోని సూసిటీ షోరూం, నిర్మాహకులు

నగరంలోని టవర్‌క్లాక్ వద్ద ఉన్న షూసిటీలో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు సంస్థ అధినేత కె.మధు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ 30ఏళ్ల అనుభవంతో 9ఏళ్ల క్రితం షూ సిటీ సంస్థను ప్రారంభించినట్లు తెలిపారు. అప్పటి నుంచి జిల్లా ప్రజలు తమ సంస్థలను ఆదరిస్తున్నారని వివరించారు. ప్రస్తుతం 10వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా మూడు ఫ్లోర్లలో షోరూంను తీర్చిదిద్దినట్లు తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని కుటుంబ సమేతంగా షాపింగ్ చేయటానికి సరికొత్త వెరైటీలను తెప్పించినట్లు తెలిపారు. అన్నివర్గాల వారికీ చెప్పుల్స్, రన్నింగ్, క్యాజువల్, బ్రైడల్ షూస్‌తోపాటు అన్ని రకాల చెప్పుల్స్‌ను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రముఖ సంస్థలైన ప్యూమా, రీభక్, బాటా, ఉడ్‌ల్యాండ్, స్కెచ్, ఏర్స్, వంటి రకాల కంపెనీలను అందుబాటులో ఉంచామన్నారు. అలాగే పాఠశాల విద్యార్థుల షూస్‌పై 10 నుంచి 20శాతం వరకూ డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రథమ చికిత్సపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రథమ చికిత్సపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ప్రగతి పథం యూత్ అసోసియేన్ ఆధ్వర్యంలో శుక్రవారం అనంతపురం అర్బన్ బ్యాంక్ మీటింగ్ హాల్‌లో ప్రథమ చికిత్సపై శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ శాతం ప్రజలు ప్రమాదాలు బారిన పడుతున్నారు. అలాంటి సమయంలో సకాలంలో వైద్యం అందక ఎంతోమంది ప్రాణాలను కోల్పోతున్నారు. కావున ప్రతి ఒక్కరూ ప్రథమ శిక్షణ పొంది అత్యవసర సమయంలో ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ వైస్‌ఛైర్మన్ డాక్టర్ మనోరంజన్‌రెడ్డి, ఐక్యరాజ్యసమితి అవార్డు గ్రహీత బిసాటి భరత్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాటి జీవన్‌కుమార్, రెడ్‌క్రాస్ సొసైటీ సెక్రెటరీ మోహన్‌కృష్ణ, అనంతపురం అర్బన్ బ్యాంకు డైరక్టర్ సుంకర రమేష్, ట్రైనర్ డాక్టర్ కృష్ణవేణి, సాయిట్రస్టు విజయ సాయికుమార్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి నందిత, అలేఖ్య, షేక్ చాందిని, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ సభ్యులు శేషాద్రి, శీను, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

గుత్తి : మండలంలోని వన్నెదొడ్డి గ్రామంలో శుక్రవారం నూతన సిసి రహదారి పనులను ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, సర్పంచి బేడల లక్ష్మీదేవి ప్రారంభించారు. గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సమయంలో రహదారులను నిర్మించాలని ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి దృష్టికి ప్రజలు తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ రూ.10 లక్షల నిధులు మంజూరు చేయడంతో పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ గాండ్లపాటి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా నాయకులు బేడల వెంకటరాముడు, నాయకులు వెంకటరామిరెడ్డి, టెంకాయల నారాయణ, తిమ్మప్ప, బేడల రమేష్, స్టోర్ డీలర్ కొల్లె మల్లికార్జునపాల్గొన్నారు.

1 నుంచి బయోమెట్రిక్ సౌకర్యం

రాయదుర్గం : పెన్షనర్ల సౌకర్యార్థం పట్టణంలోని పెన్షనర్ల భవన్‌లో జనవరి మొదటి తేదీ నుంచి బయోమెట్రిక్ సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు రామాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్లు వార్షిక జీవిత సర్టిఫికెట్‌ను సబ్ ట్రెజరీలో ఇవ్వాల్సి ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

'సూపర్ సిక్స్'తో ప్రజలకు లబ్ధి : టిడిపి

ప్రజాశక్తి-పామిడి



మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న టిడిపి నాయకులు

టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న ఆరు పథకాల ద్వారా అన్నివర్గాల ప్రజల అభివృద్ధి సాధ్యమని, మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్, అనంతపురం పార్లమెంట్ డాక్టర్స్ సెల్ అధ్యక్షురాలు పత్తి హిమబిందు తెలిపారు. శుక్రవారం మండలంలోనిజి.కొట్టాల, కాలాపురం గ్రామాల్లో జితేంద్రగౌడ్, పాల్యం తండా, అప్పాజీపేట గ్రామాల్లో హిమబిందు 'బాబు షూరిటీ..భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈయా కార్యక్రమాల్లో చంద్రశేఖర్‌రెడ్డి, మల్లేష్‌రెడ్డి, ఆదిరెడ్డి, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, ఓబిలేసు, సూరి, తిప్పారెడ్డి, జనసేన ధనుంజయ, సుధాకర్, లక్ష్మన్న, చలపతి, అరవింద్, అనిల్, సూర్యనారాయణ, మురళి, నల్లప్ప, సుధాకర్, వెంకటేష్, జోగి నాగరాజు, రామ్‌మోహన్, టిడిపి నాయకులు కిషోర్, దేవుడునాయక్, రాముడునాయక్, గోవిందనాయక్, పార్థసారథి, పామిడి నాయకులు ముసలిరెడ్డి, దేవరపల్లి సర్పంచి ప్రతాప్, తిరుపాలు, రామంజి, శీన, నల్లప్ప, మునీంద్ర, ప్రతాప్, చాగంటి గోవిందరాజులు, రామయ్య, నారాయణ, కదిరప్ప, మనోహర్, ఉమానాయక్, రాధా, జానకి, అరుణ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

సౌత్ ఇండియన్ సైన్స్ ఎగ్జిబిషన్‌కు పుట్లూరు విద్యార్థి

పుట్లూరు : రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అనూహ్యారెడ్డి అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. గైడ్ టీచర్ రాజేశ్వరి ఆధ్వర్యంలో 'ట్రాఫిక్ ఫ్రీ బస్ విత్ ఔట్ పొల్యూషన్' అంశంపై ప్రదర్శన చేసి క్షుణ్ణంగా వివరించి రాష్ట్రస్థాయి నుంచి సౌత్ ఇండియన్ సైన్స్ ఫైయిర్‌కు ఎంపికైంది. ప్రతిభ కనబరిచిన విద్యార్థి అనూహ్యారెడ్డిని రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి అభినందిస్తూ అవార్డు అందజేశారు.



విద్యార్థినిని అభినందిస్తున్న అధ్యాపకులు

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు : ఆర్‌డిఒ



ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ శ్రీనివాసులురెడ్డి

గుత్తి : ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని గుంతకల్లు ఆర్‌డిఒ వాకా శ్రీనివాసులురెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని సర్వే నెంబర్ 727, 728, కొత్తపేట గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 431లో ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములు, స్థలాలను పరీక్షించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, మండల రెవెన్యూ అధికారి సందీప్, సర్వేయర్ శేష సాయి, వీఆర్వోలు రంగయ్య, పవిత్ర, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్పోర్ట్స్ డే



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న అతిథులు

అనంతపురం : నగరంలోని కమ్మభవన్ సమీపంలో ఉన్న శ్రీచైతన్య సిఅండ్ఎం బ్యాచ్ డేస్కాలర్ క్యాంపస్‌లో శుక్రవారం స్పోర్ట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీచైతన్య విద్యాసంస్థల ఎజిఎం సుబ్బారెడ్డి, 4వ పట్టణ సిఐ ప్రతాపరెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్ క్రీడా పతాకావిష్కరణ చేసి క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎజిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ పిల్లలు చదువులోనే కాకుండా ఆటపాటల్లో కూడా తమ శక్తిసామర్థ్యాలను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు ఇలాంటి అవకాశాలను ఉపయోగించుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొంది. విద్యార్థులకు బంగారు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ విశ్వనాథ్, కోర్డినేటర్ రాధాకృష్ణనాయడు, డీన్‌లు శ్రీనివాస్, రిషి, సతీష్, పిఇటి రవిరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టిడిపి మాయమాటలు నమ్మొద్దు : ఎమ్మెల్యే తోపుదుర్తి

ప్రజాశక్తి-ఆత్మకూరు




మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

తెలుగుదేశం పార్టీ నాయకుల మాయమాటలు నమ్మొద్దని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆత్మకూరు, అనంతపురం రూరల్, రాప్తాడులో ఆయా మండలాల పార్టీ కన్వీనర్లు, జెడ్పీటిసి సభ్యుడు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ఇతర ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 జనవరి 1 నుంచి 3 వేలకు పింఛన్ పెంచుతున్నామన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా 17 వేల ఇళ్లు ఇచ్చామన్నారు. సుమారు రూ.వెయ్యి కోట్లు ఇంటి పట్టాలు, ఇళ్లకే ఖర్చు చేశామన్నారు. టిడిపి జెండాలు మోసిన వారికి కూడా ఇల్లు కట్టించామన్నారు. రాప్తాడు నియోజకవర్గాన్ని అహుడా పరిధిలోకి తీసుకొచ్చామన్నారు. పదవులు లేకున్నా రైతులు బాగుకోసం సొంత ఖర్చుతో ఉచిత బోర్లు వేశామన్నారు. ప్రకాష్‌రెడ్డి అనే వ్యక్తి జగనన్న పెట్టిన ప్రతినిధి అని.. తమ తాతల కాలం నుంచి నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తున్నామన్నారు. ఈ మట్టిలోనే పుట్టాం.. ఇక్కడే పోటీ చేస్తా గెలిచి తీరుతానన్నారు. ఇకపోతే 20 ఎకరాలు ఉన్న పరిటాల సునీత 2వేల ఎకరాలు, వందల కోట్లకు ఎలా పడగలెత్తిందని ప్రశ్నించారు. కరోనా సమయంలో తాము ప్రాణాలకు తెగించి సేవ చేశామన్నారు. రెండు కోట్లు ఖర్చుతో ఆక్సిజన్ సిలిండర్లు అందించామని గుర్తు చేశారు. కాయగూరలు, సరుకులు ఇచ్చామన్నారు. ఆ సమయంలో పరిటాల సునీతకు ఎక్కడా కనబడలేదన్నారు. నెలరోజుల్లో తగరకుంట రోడ్డు పూర్తి చేయడంతోపాటు పీఏబీఆర్ నుంచి రూ.36 కోట్లతో ఇంటింటికీ కొళాయి పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాప్తాడులో మళ్లీ ప్రశాంతమైన వాతావరణం ఉండాలంటే వైసిపి జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ఉరవకొండ : వజ్రకరూరు మండల కేంద్రంలో యుటిఎఫ్ ముద్రించిన డైరీ, క్యాలెండర్లను మండల విద్యాశాఖ అధికారి తిమ్మప్ప శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రామప్పచౌదరి, జిల్లా కార్యదర్శి శేఖర్, మండల అధ్యక్షుడు జయరాములు, గౌరవాధ్యక్షులు శ్రీనివాసగుప్తా, ఉపాధ్యక్షులు పవన్, మురళి, శ్రీదేవి, రాంబాబు, మోహన్‌బాబు, సుధాకర్, మోహన్, మైలార్ లింగ, శ్రీధర్, సంతోష్, రవిచంద్ర, మధుబాబు, బాషా, కృష్ణ, ఉపాధ్యాయినిలు మల్లేశ్వరి, మేనక, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

'ఆర్యన్'లో ఫుడ్ కార్నివాల్



ఫుడ్ కార్నివాల్‌లో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

అనంతపురం : తపోవనంలోని ఆర్యన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శుక్రవారం ఫుడ్ కార్నివాల్‌ను ఘనంగా నిర్వహించారు. ఇందులో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని వంటలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి డిప్యూటీ ఆర్ఎంఒ, ఐఎంఎ ఉమెన్ డాక్టర్స్ వింగ్ ఛైర్‌పర్సన్ జి.హేమలత మాట్లాడుతూ ఒత్తిడితో కూడిన దైనందిన జీవితంలో తల్లిదండ్రులకు ఇలాంటి ఆటల పోటీల వల్ల మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లహరి, డైరెక్టర్లు సందీప్, రాజు, ఎజి.ప్రమీలమ్మ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా బోయ ఓబులేసు

ఉరవకొండ : కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా మండల పరిధిలోని ఇంద్రావతి గ్రామానికి చెందిన బోయ ఓబులేసు నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా అధ్యక్షులు సిరిబాల ప్రతాప్‌రెడ్డి మియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర జిల్లా కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

జెఎన్‌టియు బిఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం : స్థానిక జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన బి.ఫార్మసీ 4వ సంవత్సరం 1వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, బి.ఫార్మసీ 4వ సంవత్సరం 1వ సెమిస్టర్ సప్లిమెంటరీ, బీ.ఫార్మసీ 4వ సంవత్సరం 2వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఇ.కేశవరెడ్డి కంట్రోలర్ ఆఫ్ ఎక్సామినేషన్ బి.చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ www.jntua.ac.inను సంప్రదించాలని తెలిపారు.

31 వరకూ వడ్డీ లేకుండా ఆస్తి పన్ను చెల్లించొచ్చు

అనంతపురం కార్పొరేషన్ : నగరపాలక సంస్థ పరిధిలోని పన్ను చెల్లింపుదారులు ఈనెల 31వతేదీ వరకూ వడ్డీ లేకుండా పన్ను చెల్లించే అవకాశం ఉందని కమిషనర్ భాగ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున పన్ను చెల్లింపుదారులు తమ ఇంటి పన్ను, ఖాళీ జాగా పన్ను 2023-2024 రెండో అర్ధ సంవత్సరానికి వడ్డీ లేకుండా చెల్లించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.